ప్రజాశక్తి

సోమవారం 12 ఆగస్టు 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

వలకు చిక్కని చేప



- సముద్రంలో మత్స్య సంపద కోసం కష్టాలు
- పూటగడవక మత్స్యకారుల అవస్థలు
- నాలుగు నెలలైనా అందని నిషేధ కాల భృతి



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు రెండు నెలల పాటు సముద్రంలో వేటను ప్రభుత్వం నిషేధించింది. వాతావరణ పరిస్థితులు మార్పులు చోటుచేసుకోవడంతో చేపల వేట విరామం తర్వాత సముద్రంలోకి వెళ్లిన బోట్లకు మత్స్య సంపద దొరకడం లేదు. దీంతో బోటు యజమానులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. మత్స్యకారులకు పూట గడవని పరిస్థితి ఏర్పడింది. కుటుంబ పోషణకు, పొట్ట నింపుకోవడానికి అప్పులు చేయాల్సిన దుస్థితిలో పడిపోయారు. మరోపక్క వేట నిషేధ భృతి నాలుగు నెలలైనా అందకపోవడం మత్స్యకారులను ఆందోళనకు గురిచేస్తోంది. కృష్ణాజిల్లాలోని 111 కిలో మీటర్ల సముద్రతీరం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో పెద్ద బోట్లు 530, నాటు పడవలు రెడు వేల సముద్ర ఉత్పత్తుల వేటకు వెళతాయి. 15 వేల మంది వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. బందరు గిలకలదిండి ప్రాంతానికి చెందిన మత్స్యకారులు దక్షిణాన తమిళనాడు వెల్లూరు...ఉత్తరాన అంతర్వేది వరకు సముద్రంలో 12 నాటికల్ మైళ్ల లోపలకు వెళ్లి వేట సాగిస్తారు. సముద్రంలోకి వెళ్లిన బోటులో ఎనిమిది నుంచి తొమ్మిది మంది మత్స్యకారుల బృందం ఏడు నుంచి ఎనిమిది రోజులు వేట సాగిస్తారు. వేట నిషేదం తర్వాత ఇప్పటి వరకు ఒక్కో బోటును నాలుగు దఫాలు సముద్రంలో వేటకు (మిగతా 2లో)



కృష్ణాజిల్లా గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పర్యావరణ, మత్స్యశాఖ అధికారుల బృందం

ఆక్వా రంగం అభివృద్ధికి తోడ్పడాలి

కేంద్ర బృందాన్ని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ పనులను కేంద్ర పర్యావరణ, మత్స్యశాఖ అధికారుల బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా, మత్స్య పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు.

వార్త మెయిన్‌లో

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు
- ఫ్రైడే డ్రై డే ద్వారా విస్తృత అవగాహన
- వియంసి సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి





ప్రజాశక్తి-విజయవాడ

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ పి.రత్నావళి పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, కొండ ప్రాంతాలు, కాలువగట్లు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలబడకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టామన్నారు. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రస్తుతం చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఆమె 'ప్రజాశక్తి'కిప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: డ్రెయిన్ల నిర్వహణ ఎలా జరుగుతుంది?

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో పాటు పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలబడకుండా పలు రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రత్యేకించి మేజర్, మైనర్, మీడియం కెనాల్స్‌లో డీసిల్టింగ్ పనులను ఎక్కడికక్కడ చేయించడం జరిగింది. గత నెలలోనే ఈ పనులను దాదాపుగా పూర్తి చేయడం జరిగింది. 96 కిలోమీటర్ల మేజర్, 1126 కిలోమీటర్ల పొడవునా మైనర్ డ్రెయిన్లు, మరో 226 కిలోమీటర్ల పొడవునా మీడియం డ్రెయిన్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, పూడిక తీసే పనిని పూర్తి చేయించాం. యాక్షన్ ప్లాన్ ప్రకారం నగర వ్యాప్తంగా వర్షపునీరు, ఇళ్లల్లో నుంచివచ్చే వాడకపు నీరు డ్రెయినేజీ ద్వారా వెళ్లిపోయే విధంగా డీశిల్టింగ్ పనులను చేయించాం. సివిఆర్ స్కూల్, గాంధీజి కళాశాల, నైజాంగేటు, కండ్రిక, పటమట, పంటకాలువ తదితర ఔట్‌పాల్ డ్రెయిన్లలో ప్రత్యేకించి ఇంజినీరింగ్ వారు సిల్టు తొలగించే పనిని చేయించారు. నగరంలోని 111 మురికివాడల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. బ్లాక్‌స్పాట్స్, చెత్త పడే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. పల్లపు ప్రాంతాల్లో నీటి గుంటలు లేకుండా ఇంజినీరింగ్ విభాగం అధికారులు నీటిని తోడించడం జరిగింది.

ప్రశ్న: సీజనల్ వ్యాధులు, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండటానికి ప్రధానంగా దోమలు, ఈగల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే ...డ్రైడే' కార్యక్రమాన్ని నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. సచివాలయ హెల్త్ సిబ్బందితో పాటు ప్రజారోగ్య విభాగం అదికారులు, ఉద్యోగులు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రజల్లో అవగాహన కల్గించడానికి విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుంది. సీజనల్ వ్యాధుల నివారణకు,అవి సోకకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా బ్యానర్ ఏర్పాటు చేసి, వివిధ కళారూపాల ద్వారా ప్రజల్లో ప్రచారం చేయడం జరుగుతుంది. నగరంలోని ఆరు మలేరియా డివిజన్లలో ఆరుగురు శానిటరీ ఇనిస్పెక్టర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నాం. ప్రత్యేకంగా యాంటిలార్వా ఆపరేషన్‌లో భాగంగా ఎంఎల్‌ఆయిల్, (మిగతా 2లో)

నారు కొరతతో రైతుల అవస్థలు

ప్రజాశక్తి-గన్నవరం: డెల్టా గ్రామాల్లో నారు కొరత అధికంగా ఉంది. వర్షాలు తగినంత పడకపోవడంతో రైతులు చాలా మంది నార్లు పోయలేదు. బయట కొనుగోలు చేసి వేద్దామని అనుకున్నారు. అందరూ ఒకేసారి పనులు చేపట్టడంతో నారు కొరత ఏర్పడి రైతులు అవస్థలు పడుతున్నారు. ఎకరానికి సరిపడా నారు కొనాలంటే రూ.3 వేలు ఖర్చవుతోంది. నారు పీకినందుకు, పొలానికి చేర్చినందుకు రూ.2,500 అవుతుంది. నాట్లు వేసినందుకు రూ.2 వేల నుండి రూ.2,500 వరకు తీసుకుంటున్నారు. పొలంలో రసాయన ఎరువులకు మరో రూ.3 వేలు అవుతుంది. ఆదిలో దుక్కులకు రూ.2 వేలు, దమ్ముకు రూ. 2 వేలు ఖర్చు పెడుతున్నారు. సాగు నీటికి రూ.3 వేలు అయ్యిందని రైతులు తెలిపారు. అంటే ఎకరంలో నాట్లు పూర్తయ్యే సరికి రూ.19,500 వేలు దాకా పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ఎకరానికి నాట్లు అయ్యే సరికి ఖర్చు రూ.12 వేలు అయ్యేందని చెప్పారు. ఈసారి ఆలస్యం కావడంతో పాటు నీటి, నారు ఖర్చులు పెరిగాయని కౌలుదా రు రాము తెలిపారు. ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి సాగు చేస్తున్నారని వివరించారు. కౌలుదారులు కష్టాల్లో ఉన్నారు. వ్యవసాయం చేసే నాటికి డబ్బులు చేతిలో ఉండాలి. ప్రభుత్వం రుణ గుర్తింపు కార్డులు అందరికీ ఇవ్వలేదు. బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదు. సాగు చేయాలంటే డబ్బులు కావాలి. అందుకోసం అప్పులు చేస్తున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగినా ఉపయోగం ఉండటం లేదంటున్నారు. ప్ర భుత్వం అందరికీ రుణసదుపాయం కల్పిస్తామని చెప్పింది. ఆచరణలో అది జరక్కపోవడం తో కౌలు రైతుల ఏ అప్పుల సేద్యం చేపడుతున్నారు. మండలంలో నూటికి 75 శాతం భూములు కౌలుదార్ల చేతుల్లోనే ఉన్నా యి. వారే సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కౌలుదారులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. కాలువలకు పూర్తిస్థాయిలో నీరు రావాల్సిన అవసరముంది. వరి నాట్లు పూర్తయ్యే దానికి ఇంకో నెల పడుతుందని రైతులు చెబుతున్నారు. సాగు ఖర్చులు కూడా పెరగడంతో కొంత ఇబ్బంది పడుతున్నామని రైతు అవుటుపల్లి సాంబయ్య చెప్పారు. ఏదేమైనా ఈసారి వ్యవసాయం ఒడిదుడుకులకు గురవుతుందని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

వలకు చిక్కని చేప

పంపారు. వాతావరణ మార్పులతో సమస్యలు వచ్చాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదలతో సముద్రంలోని నీటి వడి వేగం పెరిగి వేటకు ఉపయోగించే వలలు మెలిపడి పోతున్నాయి. దీంతో వేటను మధ్యలోనే మానేసి వలలు చిక్కు తొలగించేందుకు ఒడ్డుకు రావాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే ఒక్కో దఫా వేటకు పంపడానికి బోటుకు ఆయిల్, ఐస్, వారం రోజుల భత్యానికి రూ.1.50 లక్షలు వ్యయం అవుతుంటే రూ. 80 వేల నుంచి లక్ష విలువైన ఉత్పత్తులు పట్టుబడటం లేదు. 50 రోజులు నాలుగు సార్లు బోటును వెటకు పంపిన యజమానులు ఒకొక్కరు సగటున లక్ష నుంచి లక్షన్నర వరకు నష్టపోయామని చెబుతున్నారు.

పూటగడవక మత్స్యకారుల ఇబ్బందులు

సముద్రపు వేటకు వెళ్లే క్రమంలో బోట్ల నిర్వహకులు గతంలో రోజువారీ కూలి పద్ధతిలో మత్స్యకారులకు నగదు చెల్లించేవారు. అయితే కొన్నేళ్ల క్రితం ఈ పద్ధతిలో మార్పుల చేశారు. పట్టుబడిన సముద్ర ఉత్పత్తుల్లో రూ.లక్షకు రూ.15 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో రోజుల తరబడి సముద్రంలోకి వెళ్ళిన మత్స్యకారుల ఆదాయాల్లోనూ కోత పడుతోంది. వారానికి రూ.45 వేలు రావాల్సిన బృందానికి రూ.మూడు వేల నుంచి రూ. 10 వేల లోపు మాత్రమే ఆదాయం వస్తోంది.

పూట గడవడం కష్టంగా ఉంది

కె.వీరలంకయ్య, మత్స్యకారుడు, గిలకలదిండి

వేట మీదే ఆధారపడి బతుకుతున్నా. బోటు వేటకు వెళితే రెండు టన్నుల ఉత్పత్తులు పట్టుబడి అవ్వాలి. కేవలం 300 కిలోలు పట్టుబడ్డాయి. వీటిని అమ్మితే మార్కెట్‌లో రూ.20 వేలు వచ్చింది దీనిలో 15 శాతం రూ. 3 వేలు వేటకు వెళ్లిన వారికి యజమాని నుంచి వచ్చింది. ఎనిమిది మందిమి వారం రోజులు వేటకు వెళ్లాం. ఒకొక్కరికి రూ.385 వచ్చింది. రోజుకు రూ.50 గిట్టుబాటవ్వలేదు. పూట గడవడం కష్టంగా మారింది.

బోట్లు నిలిపివేశారు.

కొక్కిలిగడ్డ సాంబశివరావు, మత్స్యకారుడు, గిలకలదిండి

వేట తప్ప మాకు ఇతర ఏ వృత్తీ తెలవదు. గిట్టుబాటవ్వక బోట్లు నిలిపేశారు. పనుల్లేక వేటపై ఆధారపడ్డాళ్లంతా ఇబ్బందులు పడుతున్నారు. బతకడానికి అప్పులు చేయాల్సి వస్తోంది.

వేట నిషేధ భృతి ఇవ్వాలి

లంకే హరికృష్ణ, మత్స్యకారుడు, గిలకలదిండి

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం భృతి విడుదల చేయలేదు. వేటకెళితే రెక్కల ముక్కలు చేసుకున్నా ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం వెంటనే వేట నిషేధ కాలపు భృతి విడుదల చేయాలి. మత్స్యకారులకు కొద్ది రోజుల ఊరట ఇస్తుంది.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

నీటి గుంటల్లో గంబూచియా చేపలు, ఫైరయిత్రాన్ మందుకొట్టడం, కల్వర్ట్‌ల కింద దోమ నిల్వ ఉండకుండా ఫాగింగ్ చేయడం వంటి చర్యల ద్వారా దోమల వ్యాప్తిని నివారించవచ్చు. కొబ్బరిబొండాలు, టైర్లు, గిన్నెల్లో నీరు నిల్వ ఐదు రోజుల కన్నా ఎక్కువ రోజులు ఉన్నట్లయితే అటువంటి మంచినీటిలో వృద్ధి అయ్యే దోమ కాటు వలన డెంగ్యూ సోకే ప్రమాదం ఉందని, ఇళ్ల పరిసరాల్లో నివాసులు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

ప్రశ్న: పారిశుధ్య మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

నగరంలోని 64 డివిజన్ల పరిధిలో కార్మికులను ఏర్పాటు చేసి, ఎక్కడా కూడా చెత్త కుప్పలు ఉండకుండా, డ్రైయినేజీ క్లీనింగ్, వీధులు స్వీపింగ్ జరుగుతుంది. ఇళ్లల్లో నుంచి చెత్త సేకరణ జరుగుతుంది. కార్మికులు, శానిటరీ సెక్రటరీలు, ఇనిస్పెక్టర్లు, బయాలజిస్ట్ నిరంతరం డివిజన్లలో పర్యవేక్షిస్తూ శానిటేషన్ మెరుగుదలకు చర్యలు జరుగుతున్నాయి.

ప్రశ్న: ఇటీవల నమోదైన కేసులు ఎన్ని?

మలేరియా నాలుగు కేసులు, డెంగ్యూ రెండు కేసులు నమోదయ్యాయి.

ప్రశ్న: ఆర్ఒ ప్లాంట్స్ నిర్వహణ ఎలా సాగుతుంది?

నగర వ్యాప్తంగా ఆర్ఒ ప్లాంట్స్‌పై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టాం. 186 ఆర్ఒ ప్లాంట్స్‌ను గుర్తించాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న 25 ఆర్ఒ ప్లాంట్స్ యజమానులకు నోటీసులు ఇచ్చాం. ఏ రోజుకారోజు వాటర్ క్యాన్లు పరిశుభ్రంగా ఉంచాలి, ప్రికాషన్స్ పాటించాల్సి ఉన్నా కొన్ని ఆర్ఒ ప్లాంట్స్ ఉల్లంఘిస్తున్నాయి. వీటిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

భళారే విచిత్రం

- చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు
- బహుమతి ప్రదానోత్సవంలో నృత్య ప్రదర్శనలతో సందడి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పిల్లలకు సెల్‌ఫోన్‌లను దూరంగా పెట్టి పుస్తకాలు పట్టించాలని వక్తల హితవు



ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. వివిధ పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు నాలుగేళ్ల వయసు నుంచి పదిహేనేళ్ల వయసు గల బాలబాలికలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని భళారే బాలలు అనిపించారు. దీంతో అమరావతి ఐకాన్‌లో పండుగ వాతావరణం నెలకొంది. విజయవాడ ఫోరమ్ ఫర్ అర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ బాధ్యులు డివిఎస్ రాజు పోటీలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అమరావతి ఐకాన్‌లో డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికలు నేర్చుకున్న వివిధ రకాల డ్యాన్సులు, నృత ప్రదర్శనలు ప్రదర్శించారు. కాజ నుంచి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్య రూపకాలు సభికులను అలరించాయి. వివిధ అపార్టుమెంట్‌ల వాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్దలు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం ఆసాంతం తిలకించారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు జగన్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

కల్మషం లేని మనసులు... భావిభారతం మీదే..

ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభ మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ బాలబాలికలు కల్మషం లేని మనసులు... కల్లాకపటం లేని నిర్ణేతలు... భావిభారతం మీదేనని.. అని అన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పిల్లలను ప్రోత్సహించి వారి ప్రతిభా పాఠవాలను, జీవితంలో పోటీతత్వాన్ని అలవర్చడానికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. బాల్యంలో తాము గడిపిన జీవితాన్ని, ఆడిన ఆటలను గుర్తు చేసుకున్నారు. నేడు టెక్నాలజీ పెరిగిన తరువాత సెల్‌ఫోన్ వచ్చి బాలబాలికలకు ఆటలను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చందమామ, బాలమిత్ర, పంచతంత్ర కథలు లాంటి పుస్తకాలు మాయమైపోయామనని ఆందోళన వెలిబుచ్చారు. పిల్లలకు పౌష్టికరమైన ఆర్గానిక్స్‌తో కూడిన ఆహార పదార్థాలను పెట్టాలని ఉద్బోధించారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం రాతి యుగంలో చిత్రలేఖనం గోడలపై వేసేవారని, ఈ రోజు అది అభివృద్ధి చెంది కళాత్మకంగా ప్రజల ముందుకు వచ్చిందని చెప్పారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికలోల సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ బాలలు సెల్‌ఫోన్‌కు అడిట్ అవ్వకండా అభివృద్ధి పథంలో నడవడానికి, ఉన్నత స్థానానికి చేరుకోవడానికి చిత్రలేఖనం పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పోటీతత్వం పెరగడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. బాలోత్సవం రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశానికి ఏకతాటిపై ఉంచడమే పోటీల లక్ష్యమన్నారు. బాలబాలికలు చదువుతో పాటు చుట్టుపక్కల జరుగుతున్న అనేక సమాజ పరిణామాలను కూడా గమనించాలని తెలిపారు. బాలల్లో శక్తియుక్తులను వెలికితీయడమే బాలోత్సవం లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద చోట్ల బాలోత్సవాలు నిర్వహించడానికి ఈ సంవత్సరం ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికల స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భరతనాట్యం, కూచిపూడి, క్లాసికల్ డ్యాన్సులు అలరించాయి. కాజ నుండి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన మూడు ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి. వీటిలో ఎక్కడ వచ్చిందమ్మ స్త్రీ జాతికి స్వాతంత్ర్యం నృత్య రూపకం పలువురి అభినందనలు అందుకుంది. ముందుగా వేదిక మీదకు అమరావతి ఐకాన్ ఎం.సంధ్యారాణి వక్తలను ఆహ్వానించారు. ఇ.రాజశేఖర్, విక్రమ్, జి.రమ్య, వై.అచ్యుతరావు, పి.విజయ, నాగరాజు, వెంకటరావు, జి.సుమ, వై.సౌజన్య, ప్రకాష్ పాల్గొన్నారు.





బహుమతులు అందుకుంటున్న బాలలు

సీఆర్పీల సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్తా

ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

జిఒ 65ను రద్దు చేయాలని డిమాండ్



ప్రజాశక్తి-మంగళగిరి

సమగ్ర శిక్ష, పాఠశాల శాఖ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి)ల సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎస్ఎల్ఎం చైతన్య స్కూల్ అవరణలో సిఆర్‌పిల ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సమావేశం కార్యదర్శి కె.గురువులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో జీవో 65కు వ్యతిరేకంగా 22 రోజులు సమ్మె చేశారని, వాటికీ జీతాలు మంజూరు చేయాలనే అంశాన్ని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగ భద్రత హెచ్‌ఆర్ పాలసీ, జీవో 65 రద్దు, తదితర అంశాలను మంత్రి లోకేష్‌తో సమావేశమై చర్చిస్తామని హామీనిచ్చారు. టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ సీఆర్పీల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సీఆర్పీల డిమాండ్లను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఆర్పీ జాబ్ చార్ట్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ నాయకులు పి.కిషోర్, కాపునాడు టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జివిల్వి మాధవరావు, యు.సాయి కుమార్, రామాంజనేయరెడ్డి, బి.మధు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
సోమవారం 12 ఆగస్టు 2024

ఉరివి రక్షిత మంచినీటి చెరువు వద్ద చెట్లతో కూడుకుపోయిన ఫిల్టర్ బెడ్లు





ముచ్చలగుంటలో మట్టితో పూడ్చివేసిన మంచినీటి కుళాయి

పల్లెల్లో పారిశుధ్యం అధ్వానం

- ఫిల్టర్ బెడ్లపై పిచ్చిమొక్కలు
- నాలుగేళ్లుగా మట్టిలో మగ్గుతున్న నీటి కుళాయిలు

ప్రజాశక్తి-పెడన : వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రభలగుండ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు చేయాలని సాక్షాత్తు ఉన్నతాధికారులే ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మండల అధికారుల, సిబ్బంది పనితీరు తయారైంది. ఈ విషయంపై గత పక్షం రోజుల క్రితం సాక్షాత్తు జిల్లా ఉన్నత అధికారులే సిబ్బంది, అధికారులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లాలోని 11 మండలాల్లో 11వ స్థానంలో జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పెడన మండలం పారిశుధ్యం, తాగునీరు పలు కార్యక్రమాల్లో అలసత్వం ప్రదర్శించారని గంటల తరబడి సిబ్బందిని కార్యాలయం ఆరుబయట నుంచో పెట్టారు. అయినప్పటికీ తీరు మాత్రం మారడం లేదని తెలుస్తోంది.

వివరాల్లోకెళితే పెడన మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి 39 శివారు గ్రామాలు ఉన్నాయి. వీటిల్లోని ఉరివి, చెన్నూరు, కోపల్లి పంచాయతీలతో పాటు పలు పంచాయతీలు కనీసం తాగునీరు కూడా ఏర్పాటు ఏర్పాటు చేయడం లేదు. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు కిలోమీటర్ల మేర వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందంటూ వాపోతున్నారు. ఉరివి పంచాయతీ రక్షక మంచినీటి పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్లు గత ఐదు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో చేసేది లేక పక్కనే ఏర్పాటు చేసిన ఆరో ప్లాంట్ పైనే గాయంపాడు, ఉరివి ప్రజలు ఆధారపడి దాహార్తిని తీర్చుకుంటున్నారు. చెన్నూరు లోని రక్షిత మంచినీటి చెరువులో తూడు, కలువ చెట్లు తో పుడుకుపోయింది. చేసేది లేక ఆ చెరువులో నీరే చెన్నూరు, గొల్లగూడెం గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కలుషిత మంచినీరు తాగడం వలన రోగాలు బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు చెబుతున్నారు.

నాలుగేళ్లుగా మట్టిలో మగ్గుతున్న నీటి కొళాయిలు...

కొప్పల్లి శివారు ముచ్చలగుంట గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చేసుకోవడంతో ఆ గ్రామంలోని కొందరు దాదాపు 7 మంచినీటి కొళాయిలను ట్రాక్టర్ ట్రక్కులతో మట్టి వేసి పూడ్చివేశారు. వీటిపై పలుసార్లు సంబంధిత అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు అంటున్నారు. ఈ కుళాయిలు పైన 80 కుటుంబాల వారు ఆధారపడి ఉన్నారు. వీరందరూ కిలోమీటర్ దూరంలో ఉన్న కొప్పల్లి రక్షిత మంచినీటి చెరువు వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయాలపై స్థానిక ఎంపీడీవో రెడ్డియ్యను వివరణ కోరగా ఉరిమి గ్రామంలోని ఫిల్టర్ బెడ్లు ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదన్నారు. త్వరలోనే వీటిని బాగు చేసేందుకు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అలాగే కొప్పల్లి శివారు ముచ్చల గుంట గ్రామంలో మంచినీళ్ల కుళాయిలు పూడ్చి వేసిన విషయం తన దష్టికి రాలేదన్నారు. సంబంధిత కార్యదర్శులు పిలిచి విచారిస్తామన్నారు.



వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

వైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో డాక్టర్ జి పవన్ కుమార్ రెండవ వార్డ్ లో ఏర్పాటుచేసిన శంకర్ రెటీనా ఫౌండేషన్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ కంటి వైద్య చాలా ప్రారంభించి కంటి ఆపరేషన్లు అందుబాటులోకి తీసుకురావడం దివి ప్రజలకు శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నేత మండలి వెంకట్ రామ్, సంతాన సాఫల్య స్పెషలిస్ట్ డాక్టర్ నవ్య, డాక్టర్ బాధల సత్యనారాయణ, డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని యాత్రికులు అధిక సంఖ్యలో ఆదివారం దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారి దేవస్థానానికి విచ్చేసిన యాత్రలకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన కార్యనిర్వహ ణాధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాట్లు పరిశీలించారు. మచిలీపట్నం గ్రామానికి చెందిన ఆర్ జానకీ రమణ దంపతులు 45 వేల రూపాయల విలువ గల 1/2 కేజీ వెండి చక్ర శంఖువును సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌కు అందజేశారు.



వెండి చక్ర శంఖువును అందిస్తున్న దృశ్యం

నిధులు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని జనసేన మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు దశాబ్దాలుగా స్వతంత్రదినోత్సవ వేడుకలకు ఇస్తున్న నిధులు సరిపోవడం లేదని పంచాయతీ అధికారులు, సర్పంచ్ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నిధుల పెంపుపట్ల కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టలంక గ్రామ పంచాయతీ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, మండల ఉపాధ్యక్షులు జరుగు ఆదినారాయణ, టౌన్ ప్రెసిడెంట్ కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై దృష్టి సారించాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

ప్రజాశక్తి-ఉంగుటూరు : యువత సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే అసలైన సంక్షేమం అని, విద్యా, వైద్యం అందిస్తే చాలు ఇంక ఏ విధమైన ఉచితాలు అవసరం లేదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ఆదివారం ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో గుడివాడ కు చెందిన ఈ వి ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడారు. వివిధ ప్రభుత్వాలు ఓట్ల కోసం, తాత్కాలిక రాజకీయ లబ్దికోసం అవసరం లేని ఉచిత పథకాలు తీసుకువస్తున్నాయని, దీని వల్ల ప్రజలకు దీర్ఘకాలికంగా జరగవలసిన లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందన్నారు. ఆకలితో ఉన్న వ్యక్తికి చేపలు ఇస్తే అప్పటికి సంతృప్తి చెందుతాడని, కానీ అదే వ్యక్తికి చేపలు పట్టడం నేర్పిస్తే తాను ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎన్ని కావాలంటె అన్ని చేపలు పట్టుకోగలుగతాడని, దీని వల్ల ఎవరి మీదా ఆధారపడే అవసరం లేకుండా ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్రభుత్వం యువతకు తమ కాళ్ళ పై తాము నిలబడగలిగేలా నైపుణ్యంతో కూడిన శిక్షణ ఉచితంగా అందిస్తే ఆత్మగౌరవంతో సుఖ సంతోషాలతో బతుక గలుగుతారని, ఇదే అసలైన సంక్షేమం అన్నారు. తల్లితండ్రులు ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించడం పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. పాశ్చాత్య జీవనశైలి మోజులో పడి ఆరోగ్యకరమైన భారతీయ జీవన శైలిని విడనాడుతూ అనారోగ్యానికి గురవుతున్నారు అని అన్నారు. వైద్యం కోసం వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షల తో పాటు, ఉచిత భోజన సదుపాయం, వారానికి సరిపడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రాజ్యలక్ష్మి ఈడుపుగంటి, డాక్టర్ రాజేంద్ర క్రాంతి, డాక్టర్ రేవంత్ కుమార్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ అమ్రత కొండపల్లి, డాక్టర్ రఘురాం మన్నెం, డాక్టర్ సుమన్ కుమార్ తదితరులు పాల్గొని వైద్యసేవలు అందించారు.



వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ ఎస్సై కే శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం పంచాయతి పరిధిలోని ఏడో వార్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుండ రూ 2350 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం రాగానే సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. **ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ) :** నందివాడ మండలంలోని కోళ్ల పందాల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రుద్రపాక శివారు గోపాలపురం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అనంతరం వారి వద్ద నుంచి రూ.1080లు. నగదును రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో ఎవరైనా జూదం నిర్వహిస్తే సహించలేదని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు. జొన్నపాడు సెంటర్‌లో పోక్సో చట్టం, గంజాయి సమాచారం, సైబర్ మోసాలను నిరోధించడం (1930), ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు, డయల్ 100 కాల్ గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్‌పేట సిఐగా ఏసుబాబు బాధ్యతలు



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం ఆర్‌పేట సిఐగా కొండా ఏసుబాబు ఆదివారం బాధ్యతల స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గుడివాడ రూరల్ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఏసుబాబు ఆర్ పేట స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు తీసుకున్న ఏసు బాబు అనంతరం జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సిఐగా బాధ్యతలు తీసుకున్న ఏసు బాబుకు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్



ప్రజాశక్తి-పమిడిముక్కల : కష్ణా నది వరద వస్తున్న కారణంగా పమిడిముక్కల మండలంలోని లంకపల్లి, ఐనపూర్ గ్రామాలలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నవీన్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు వస్తుండడంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మండలంలోని లంకపల్లి, ఐనపూర్ గ్రామాల రైతులు తమ పశువులను తోలుకొని వరద ప్రాంతాల వైపు వెళ్లరాదని సూచించారు.ఎవరూ కూడా నీటిలో దిగే ప్రయత్నం చేయవద్దు అని సూచించారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కూరాడ లాకు దిగువ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి 77వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కనకదుర్గ అమ్మవారి వేషం, భూత పేతాల, శివ కాళీ డాన్స్, సింగ్ సింగదు డాన్స్, కోయ డాన్స్, మిక్కీ మౌస్, చిత్ర విచిత్ర వేషాలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి ప్రభ ఊరేగించారు. గ్రామాల్లో యాత్రికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎస్ఐ సారధి బాబు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



'అవన్' బ్యూటీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయమని, పదిమందికి ఉపాధి కల్పించాలని అవన్ బ్యూటీ క్లినిక్ ఏర్పాటు చేయడం మంచి పరిణామం అని పశ్చిమ ఎంఎల్ఎ సుజనా చౌదరి అన్నారు. ప్రతి పదివేల మందికి ఒక బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేయడం ద్వారా మరింత ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం భవానీపురంలోని హెచ్‌బి కాలనీలో అవన్ బ్యూటీ క్లినిక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. నిర్వాహకులు బబ్బురి భూపాల్, బబ్బురి శ్రీరామ్, పావని మాట్లాడుతూ అందాన్ని పెంపొందించుకోవాలనుకునే వారికి అతి తక్కువ ధరలో ట్రీట్‌మెంట్ అందించాలనే లక్ష్యంతో, అలాగే పదిమందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంతో క్లినిక్ ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరి కొంతమందికి ట్రైనింగ్ ఇచ్చి వారికి కూడా ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ అందానికి మెరుగులు దిద్దేందుకు అధునాతన పరికరాలతో అన్ని రకాల సౌకర్యాలు తమ బ్యూటీ క్లినిక్‌లో ఉన్నాయని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక కొత్తపేటలోని కోమలవిలాస్ సెంటర్ సమీపంలోని సంగీత పోలిక్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యశాల ఎం.డి డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, విభాగాలలో రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. హార్ట్‌కి సంబంధించిన ఇసిజి ఉచితంగా చేసి మందులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ పి.రమ్య, జనరల్ మెడిసిన్ డాక్టర్ హరిహరన్, ఆర్థోవిభాగంలో డాక్టర్ రత్నాకర్ తమ విలువైన వైద్య సేవలను అందించారని, ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో సంగీత పోలిక్లినిక్, ప్రజావైద్యశాలల్లో వైద్యసేవలను అందచేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉచిత వైద్యశిబిరాన్ని తెలుగుదేశం నాయకులు ఎం.ఎస్ బేగ్, వైఎస్ఆర్సీపీ నాయకులు పోతిన మహేష్, సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మహేష్ తదితరులు సందర్శించి వైద్యులను ప్రశంసించారు.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సమాజంలో ఉన్న పేదలకు తమకు తోచిన సాయం చేయడం ద్వారానే పుణ్యం లభిస్తుందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు మహమ్మద్ ఫరూక్ షిబ్లీ పేర్కొన్నారు. ఆదివారం మౌలానగర్ వైఎస్సార్ కమ్యూనిటీ హాల్ నందు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మహిళా విభాగం, హోప్ విన్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పటు చేసిన ఉచిత వైద్యం శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షామా సుల్తానా అధ్యక్షత వహించారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రోగాలకు సంబంధించిన అనేక మంది వైద్యులు పాల్గొని సేవలందించారు. ఈ సందర్భంగా ఫరూక్ షిబ్లీ మాట్లాడుతూ ఉచిత వైద్య సేవలను పేదలు అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.ఎన్. మెహెపారా, డాక్టర్ సారిక షేక్, డాక్టర్ అహ్మమ్మద్ షఫీ షేక్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బొమ్మసాని

యువత స్వయం సమృద్ధి సాధించాలి : ఎంఎల్ఎ సుజనా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో స్వదేశీ స్వావలంబన రాష్ట్ర మహాసభను, ఆదివారం కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఎ యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తితో రూపొందించిన స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమం ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. దేశంలో ఉన్న అన్ని రకాల వృత్తులను కాపాడటానికి దేశం ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. స్వదేశీ జాగరణ మంచ్ స్ఫూర్తి ,రైతాంగాన్ని కాపాడటం, చిన్న తరహా పరిశ్రమలు, చేతి వృత్తులను ప్రోత్సహించడం, జరుగుతుందన్నారు. స్వదేశీ ఉత్పత్తులను వాడటం ద్వారా స్వయం సమృద్ధి సాధించొచ్చన్నారు. స్వదేశీ ఉత్పత్తులను వాడాలని తద్వారా చిన్న తరహా పరిశ్రమలు అభివృద్ధి చెంది స్థానికంగా ఉపాధి పెరిగి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రధాని మోదీ అందిస్తున్న రుణాలను యువత సద్వినియోగం చేసుకొని చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. యువత ఉద్యోగం చేయడం కాకుండా ఉద్యోగాలను కల్పించాలన్నారు. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి స్వదేశీ వ్యాపారులను ప్రోత్సహించాలని స్వదేశీ జాగరణ మంచ్ నేషనల్ కో-కన్వీనర్ అజయ్ పాట్కి అన్నారు. వోకల్ ఫర్ లోకల్ నినాద స్ఫూర్తితో అన్నింటా భారతీయ భావం నెలకొంటుందని అదే స్వదేశీ జాగరణ మంచ్ లక్ష్యం అన్నారు. యువతను, వ్యాపారులను, ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు, చిన్న తరహా పరిశ్రమలకు అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ ఆల్ ఇండియా అధ్యక్షులు కుమార్ స్వామి, స్వావలంబి భారత్ అభియాన్ ఏపీ అధ్యక్షులు అంజనీ శ్రీనివాస్, స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ హేమంత్, బోయపాటి నాని చౌదరి, మహిళా ప్రముఖ్ పావని, ఆదిలక్ష్మి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు, పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

14న ఆట-పాట, సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ : 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సింగ్‌నగర్ 60వ డివిజన్ వాంబే కాలనీలో ఈ నెల 14న జరిగే ఆట - పాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, ఎంవి.సుధాకర్ కోరారు. దుర్గాపురం బిఆర్‌టిఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు భవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిఐటియు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆట-పాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సి.హెచ్ బాబురావు, ఇతర ప్రజా సంఘాల నగర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. 60.వ డివిజన్ వాంబే కాలనీ జంధ్యాల దక్షిణమూర్తి స్కూల్ వద్ద సాయంత్రం 6 గంటల నుండి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సాంస్కృతిక కళారూపాలు, అభ్యుదయ పాటలు, కోలాటం, వీణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆనాడు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనకుండా బ్రిటిష్ వారికి అండగా నిలిచిన వారి వారసులు బిజెపి-మోడీ ప్రస్తుతం దేశంలో పాలన చేస్తున్నారని అన్నారు. ఈ నాటి కేంద్రంలోని పాలకులు దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒకవైపున దేశ చరిత్రను వక్రీకరిస్తూ, మరొక వైపున రాజ్యాంగానికి తూట్లు పొడిచే కార్యక్రమాన్ని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు నగర నాయకులు టి.ప్రవీణ్, వై,సుబ్బారావు, ఎం.బాబురావు, ఎం.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

అబద్ధపు ప్రచారం సరికాదు : బుద్ధా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజల డబ్బుతో మాజీ సిఎం జగన్ తన పదవీకాలంలో విలాసవంతమైన జీవితం గడిపాడని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జగన్ అంబేద్కర్ విగ్రహం పెట్టి అంబేద్కర్ పేరు కన్నా జగన్ పేరు పెద్దదిగా పెట్టుకున్నారని విమర్శించారు. అందుకే అంబేద్కర్ అభిమానులు జగన్ పేరు తొలగించి ఉండవచ్చని అన్నారు. ఇప్పుడు వైసిపి నేతలు ఏదో జరిగిపోయినట్లు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 27 సంక్షేమ పథకాలను దళితులకు ఇవ్వకుండా జగన్ నిలిపేశారని, జగన్‌కు అంబేద్కర్ పేరు ఎత్తే అర్హత కూడా లేదని అన్నారు. అమరావతిలో అంబేద్కర్ విగ్రహం కట్టి తీరతామని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు షేక్ ఆషా, తుపాకుల రమణమ్మ, ఉమ్మడి చంటి, శివాజీ ముదిరాజ్, ముదిగొండ శివ, బొడ్డుపల్లి శ్రీనివాస్, కొప్పుల గంగాధరరెడ్డి, పేరం సత్య నారాయణ, కొనికి కొండయ్య, ఈగల సాంబ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పట్టణానికి చెందిన అనుమాల దీక్షిత్ సాయి వైద్యఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌ను మండల టిడిటి అధ్యక్షుడు కోగంటి బాబు బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. నందిగామ ఎమ్మెల్యే. తంగిరాలు సౌమ్య సిఫారసు మేరకు బాధితుని వైద్యఖర్చుల నిమిత్తం 2,04,000 ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరయ్యాయి. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీక్షత్ సాయి కుటుంబ సభ్యులకు కోగంటి బాబు చెక్ అందజేశారు. ఈ కార్యక్లమంలో నాయకులు గుత్తా రత్నం తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కోగంటి బాబు

ఎంఎల్ఎను కలిసిన ఎంఆర్ఒ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరిని ఇటీవల ఉద్యోగ పదవి బాధ్యతలు స్వీకరించిన పశ్చిమ ఎంఆర్ఓ ఇంతియాజ్ పాషా ఆదివారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థ పనిచేసే విధంగా ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు జన్మదిన సేవా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనన్నదళం రాష్ట్ర అధ్యక్షులు పోతిన వరప్రకాష్ ఆధ్వర్యంలో కార్మికులకు లుంగీలు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతిన వరప్రకాష్ మాట్లాడుతూ శ్రీనన్న పేరిట వారం రోజులు పాటు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. నాల్గో రోజు జరుగుతున్న ఈ కార్యక్రమంలో కార్మికులకు లుంగీలు, టవళ్లను పోతిన రాజేష్ చేతుల మీదుగా కార్మికులకు అందచేశామన్నారు. శ్రీనన్న కార్మికులకు అండగా నిలిచిన మంచి మనిషని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాము, అడ్డకర్ల హరి, పిళ్ళ వెంకట నారాయణరావు, నాయుడు, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై వివాదం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులో వైసిపి కౌన్సిలర్ భర్త దారా శ్రీనివాసరావు అక్రమంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న పనులను ఆదివారం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, టిపిఒ అసిస్టెంట్ నిలిపివేశారు. దీనితో శ్రీనివాసరావు 'కేసు కోర్టులో ఉంది. నేను కోర్టులో చూసుకుంటాను, మీరు ఎవరు పనులు ఆపటానికి' అని వచ్చిన ఉద్యోగులను బెదిరించి పంపారని 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు తెలిపారు. గత కొన్ని రోజుల నుండి అక్రమ కట్టడాలపై జరుగుతున్న వివాదంపై తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ ఈనెల 1వ తేదీన తిరువూరు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేయగా 23వ తేదీన వాయిదా ఉందని చెప్పారు. కోర్టు నుండి ఆదే శాలు వచ్చేవరకు నిర్మాణ పనులు చేపట్టవద్దని టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పిన శ్రీనివాసరావు ధిక్కరిస్తూ అక్రమ కట్టడ షాపింగ్ కాంప్లెక్స్ పైన పెంట్ హౌస్ కి స్లాబ్ పనులు చేస్తున్నాడని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రజల ఆస్తులను కాపాడాలని, లేని యెడల నగర పంచాయతీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని దుర్గారావు హెచ్చరించారు.

నివాసాల మధ్య ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక బాలయోగి నగర్‌లో నివాసాల మధ్య దట్టంగా పెరిగిన ముళ్ళకంప, పిచ్చి చెట్లను తెలుగు యువత నాయకులు లంక లితీష్ ఆదివారం తన సొంత నిధులతో శుభ్రపరిచారు. ముళ్ళకంపతో పాటు చెత్తాచెదారం పెరిగిపోవడంతో దోమలు పందులకు పాములకు నిలయంగా మారింది. స్థానికులు అనారోగ్యాం బారిన పడుతున్నారు. స్థానిక టిడిపి నాయకులు ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఎంఎల్ఎ ఆదేశాల మేరకు లితీష్ ముళ్ళకంపను తొలగించారు. సమస్యను వెంటనే పరిష్కరించినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సెటిల్‌మెంట్లకు అడ్డా ఆత్కూరు స్టేషన్..?



ప్రజాశక్తి - గన్నవరం : ఆత్కూరు పోలీస్‌స్టేషన్ సెటిల్మెంట్లకు అడ్డగా మారిందని ప్రజలు చెబుతున్నారు. సొమ్ము కొట్టినోడికి న్యాయం జరుగుతుంది. స్టేషన్లోని అధికారి నుంచి సిబ్బంది వరకు అనుసరిస్తున్న తీరిదని జనాలు చెప్తున్నారు. అంతేకాకుండా జోరుగా పేకాట కొనసాగుతోంది. మొన్నటి వరకు వైసిపి పార్టీకి చెందిన వ్యక్తులు పోలీసులతో రహస్య ఒప్పదం చేసుకుని ఆర్గనైజింగ్ జూదం నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. పోలీసులకు నెలవారీ వాటాగా వేలల్లో సొమ్ము ముడుతోందనే ఆరోపణలున్నాయి.

తెంపల్లి, మెట్లపల్లి, వీరపనేనిగూడెం, పెద్ద ఆవుటపల్లి, తేలప్రోలు, ఆత్కూరు గ్రామాల్లో రహస్యంగా పేకాట జూదాలు సాగుతున్నాయి. ఆర్గనైజర్లు ఫోన్ల ద్వారా జూదరులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు రప్పిస్తున్నారు. రోజుల తరబడి ఆట కొనసాగిస్తున్నారు. లక్షల్లో సొమ్ము చేతులు మారుతోందని చెబుతున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలని కొందరు వ్యక్తులు ఈ జూదం కేంద్రాలను నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని పోలీసులతో టై..అప్ అవుతున్నారని స్థానికులు అంటున్నారు.

రాజకీయ బ్రోకర్లదే హవా...

ఆత్కూరు పోలీసు స్టేషన్ రాజకీయ బ్రోకర్లకు అడ్డాగా మారిందనే వాదనుంది. సెటిల్మెంట్లు చేసుకుని దర్జాగా తిరుగుతున్నారు. పోలీసుస్టేషన్లో అవసరాలు తీర్చి తర్వాత వారితో సంబంధాలు పెట్టుకుని సెటిల్మెంట్లు చేస్తున్నారని తెలుస్తోంది.



స్టేషన్కు ఏదైనా సమస్య వస్తే చాలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కొందరు వాలిపోతున్నారు. ఎస్ఐతో పాటు కొందరు హెడ్ కానిస్టేబుళ్లు వారికే ప్రాధాన్యత ఇవ్వడంతో అంతా సెటిల్మెంట్లే అన్న పరిస్థితిని కల్పిస్తు న్నారు. స్టేషన్లో ఇద్దరు వ్యక్తుల హవానే కొనసాగుతోంది. స్టేషన్ రైటర్ తో పాటు ఇంకో హెడ్ కానిస్టేబుల్ చక్రం తిప్పుతున్నారని తెలిసింది. గతంలో పనిచేసిన ఇద్దరు ఎస్సైలు వీరు చెప్పినట్లుగానే చేశారు. సెటిల్మెంట్ సొమ్మంతా పోగేసి తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ బోకర్లతో వారికి మంచి సంబంధాలు కలిగి ఉంటున్నారు. కేసులు సెటిల్ చేయడంతో డబ్బులు దండుకోవడం జరుగుతోందని చెప్పారు. ఏదైనా చిన్న కేసు కోసం స్టేషన్కు వెళితే పిటీషన్ రాసి వెయ్యి నుండి రెండు వేలు వసూలు చేసే సిబ్బంది ఉన్నారని జనాలు చెబుతున్నారు. కొట్లాటలు, ఫ్యామిలీ సెటిల్మెంట్లు చేస్తే పది వేల రూపాయల పైన లాగుతున్నారట. ఇక పేకాట జూదరులు దొరికితే పండగే. భారీగా నగదు, బైకులు దొరికితే కొద్దిగా నగదు, జూదరులను కేసులో పెడుతున్నారు. బైకులు తీసుకెళ్లడానికి ఒక్కోదానికి రూ.2 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. వసూల్ రాజా ఆ పని చూసుకుంటు న్నారు. స్టేషన్లో ఏ పని కావాలన్నా రైటర్ ని ప్రసన్నం చేసుకోవాల్సిందే అంటున్నారు. దీనితో పోలీసు స్టేషన్ కు వెళ్లాలంటే చాలా మంది భయపడుతున్నారు.

ఈ స్టేషన్ ఉంగుటూరు, గన్నవరం మండలాల పరిధిలో ఉంది. రెండు మండలాల్లోని గ్రామాలు ఇందులో ఉన్నాయి. హనుమాన్ జంక్షన్ సిఐ కింద పనిచేస్తుంది. ఇక్కడ ఎస్సై చెప్పిందే వేదం. దీంతో గతంలో పనిచేసిన వారంతా సెటిల్మెంట్లకు పేకాట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి సంపాదించుకున్నారనే వాదన ఉంది. డబ్బులు కట్టలేని పేదలు న్యాయం అందక ఇబ్బందులు పడ్డారని చెప్పాలి. ఇటీవల తెంపల్లెలో జరిగిన గొడవలో ఒక వర్గం నుంచి గట్టిగానే పోలీసులు దండుకున్నారని చెప్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లిన పరిస్థితి ఉంది.

కొత్త ఎస్ఐ ఏం చేస్తారో..?



ఈ స్టేషన్ కు కొత్తగా రాజమండ్రి నుంచి సురేష్ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పైడి బాబు వేరే ప్రాంతానికి వెళ్లారు. కొత్త ఎస్ఐ సురేష్ సెటిల్మెంట్లకు చెక్ పెడతారా? పేకాట లేకుండా చూస్తారా అన్నది వేచి చూడాలి. ఏదేమైనా సిబ్బందిని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందని జనాలు అంటున్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని టిడిపి నాయకులు విమర్శించారు. ఆదివారం 8వ వార్డు వద్ద ఉన్న అంబేద్కర్ జగజీవన్ రామ్ విగ్రహాల ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడారు. విజయవాడలో అంబేద్కర్ స్మృతివనంలో విగ్రహం వద్ద శిలాఫలకంలో జగన్ పేరును అర్ధరాత్రి ఎవరు అగంతకులు తొలగిస్తే వైసిపి నేతలు రాష్ట్రంలో అల్లరి సష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సంఘటనకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ప్రభుత్వంపై బురద చల్లే పనులు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బండే రాఘవ, బచ్చు రఘునాథ్ పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళి



ప్రజాశక్తి - గుడివాడ : నిజాయితీకి నిలువెత్తు రూపం బుద్దదేవ భట్టాచార్య అని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుడివాడ సుందరయ్య భవనంలో బుద్ధదేవ భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పదకొండు సంవత్సరాలు పనిచేసినా స్వంత ఇల్లు, కారు సంపాదించుకోని బుద్ధ దేవ్ భట్టాచార్య జీవితం నేటి యువతరానికి ఆదర్శ ప్రాయమన్నారు. ఎంఎల్‌ఎగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా బెంగాల్ రాష్ట్రానికి పలు సేవలందించిన బుద్ధ దేవ్‌కి కేంద్ర ప్రభుత్వం "పద్మ భూషణ్ "అవార్డు ప్రకటించినా సున్నితంగా తిరస్కరించిన నిరాడంబరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు యెషయ్య, సురేంద్ర, శ్రీనివాసు, కొండా, గోపాల్, ఆవిర్నేని వెంకటేశ్వరరావు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-కంకిపాడు : కేరళ రాష్ట్రం వాయ్ నాడ్ ప్రాంతంలో అధిక వర్షాల వలన నష్టపోయిన కేరళ ప్రజలను ఆదుకోవలసిన బాధ్యత అందరి మీద ఉందని, దానికి ప్రతి ఒక్కరు సహకరించి వారిని ఆదుకోవడానికి విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు విజ్ఞప్తి చేశారు. కేరళ వరద బాధితుల సహాయార్థం ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కానూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, కేరళలో కొండ చర్యలు విరిగిపడి, అనేక ఇళ్ళు కూలిపోయి, 350 మంది పైగా ప్రజలు చనిపోయి, వందలాదిమంది క్షతగాత్రులు అయ్యారన్నారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మన ప్రజల మీద ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విరాళాలు సేకరించి పై కమిటీకి పంపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, జిల్లా కమిటీ సభ్యులు మాదు నాగేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు యు త్రిమూర్తులు, ఎస్.కె మస్తాన్ వలీ, పి శ్రీనివాసరావు, మదిరి ఏడు కొండలరావు, కె నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : ఎ.పి రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు వాయినాడ్ వరద బాధితులకు సహాయార్థం బంటుమిల్లి గ్రామంలో రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్ లు రూ.6,060 విరాళాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర రైతు సంఘం ద్వారా బాధితులకు పంపుతామని వారు తెలిపారు. విరాళాలు ఇచ్చిన దాతలకు వారు ధన్యవాదాలు తెలిపారు.



కంకిపాడులో...



బంటుమిల్లిలో...



సచివాలయం ప్రారంభిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : రానున్న ఐదేళ్లలో గన్నవరం నియోజకవర్గంలోకి కొత్తగా ఐటి కంపెనీలు, పరిశ్రమలు తీసుకువచ్చి 15 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తేనే... వచ్చే ఎన్నికల్లో ఓటు అడుగుతానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఆదివారం గన్నవరం మండలం పురుషోత్త పట్నంలో ఎంజి.ఎన్.ఆర్.జి.ఎస్ నిధులు రూ.43.60 లక్షలతో సర్పంచ్ మాదాల రోహిణి ఆధ్వర్యంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వ సహకారంతో గన్నవరం నియోజకవర్గంలోని మల్లవల్లి, వీరపనేనిగూడెం, విజయవాడ రూరల్ మండలంలో ఐటీ కంపెనీలు, కొత్త పరిశ్రమలు తీసుకురావడానికి మార్గం సుగమం చేస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రామాలలో అభివద్ధి కార్యక్రమాలు చేయడానికి అధికారులతో కలిసి ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని హైదరాబాద్ గచ్చిబౌలి స్థాయిలో అభివద్ధి చేయాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఇంచార్జ్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, పంచాయతీరాజ్ డిఇ పి. సురేష్ బాబు, సచివాలయ కార్యదర్శి చైతన్య, ఎంపీడీవో సత్య కుమార్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

140 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో నర్రా గంగాధర్ రావు, కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని రామకష్ణ ఆర్థిక సహకారంతో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహవ్యాధి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ గవిరినేని రజని140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 15 రోజులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. మూల్పూరి సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ వైపిసి ప్రసాద్, మెరుగు పెరుమాళ్ళు, ప్రసాద్, సూరపనేని పరంధామయ్య, గుమ్మడి రామకష్ణ, చాపరాల బాలాజీ, జంగం మోహనరావు, చాపరాల బాలాజీ, మత్తి శ్రీరామ మూర్తి పాల్గొన్నారు.



కుటుంబీకులను వివరాలడుగుతున్న అధికారి

ఆశ మృతిపై వైద్యాధికారి ఆరా

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరులో ముస్లిం మైనార్టీ ఏరియాలో శనివారం షేక్ ఆశ విష జ్వరంతో మృతిచెందడంతో జిల్లా మలేరియా వైద్యాధికారి మూర్తి గ్రామంలో పర్యటించారు. తాగునీరు డ్రైనేజీస్ వాటర్ నిల్వ ఉన్న ప్రాంతాల్ని వైద్య బృందంతో కలిసి ఆదివారం పరిశీలించారు ఆశ మృతి పట్ల ఆ కుటుంబాన్ని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబంలో మొదట అందరికీ జ్వరాలు వచ్చాయని ఈ సహజంగా వచ్చే జ్వరాలని అనుకున్నామని, విష జ్వరమని తెలిసి చికిత్స చేయించినా తగ్గలేదన్నారు. జిల్లా వైద్యాధికారి మూర్తి పరిసర ప్రాంతాలు పరిశీలించి నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉత్పత్తి పెరిగిందని దానివల్ల దోమలు పెరిగాయని పరిసర ప్రాంతాలు పరిశీలించారు ప్రతి కుటుంబంలో నిల్వ ఉన్న నీటిని గమనించి వైద్య సిబ్బంది చేత శుభ్రం చేయించారు. గ్రామపంచాయతీ తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. విజయవాడలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రిలో శనివారం ఆశ పరిస్థితిపై ఆరా తీయగా బాగానే ఉందని, ఫీజు చెల్లించాలని చెప్పారని కుటుంబీకులు తెలిపారు. బంధువులకు అనుమానం వచ్చి ఆశ ఆరోగ్య విషయాలు గట్టిగా నిలదీసి తాము ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. అంబులెన్స్ సిద్ధం చేస్తుండగా ఆశ మృతిచెందిందని, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆశ తల్లిదండ్రులు వాపోయారు.

దోమల నివారణకు చర్యలు



జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం గ్రామ పంచాయతీలో ప్రతివారం శానిటేషన్ నిర్వహిస్తూ దోమల నియంత్రణకు మలాథిన్‌ని స్ప్రే చేస్తున్నామని సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్ తెలిపారు. గ్రామంలో ప్రతి వారం దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేస్తున్నామని, పచ్చదనం పరిశుభ్రత పాటిస్తూ వీధులన్నీ పూడికతీత తీసి డ్రై చేస్తున్నామని, చెత్తాచెదారం లేకుండా చేస్తూ మంచినీటిని క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీరు గ్రామానికి అందిస్తున్నామని సర్పంచ్ పావని వెంకటేష్ తెలిపారు.

ముగిసిన గ్రామపంచాయతీ సిబ్బందికి శిక్షణ

జగ్గయ్యపేట : ఈ నెల 9 నుండి మూడు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం భాగంగా మూడో రోజు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ రిప్రెషర్ శిక్షణ కార్యక్రమం బూదవాడ గ్రామంలో ఫీల్డ్ విజిట్‌తో పూర్తయింది. బూదవాడ గ్రామ పంచాయతీలో ఉన్న చెత్త కేంద్రాన్ని దానిలో జరిగే ప్రక్రియను, వర్మీ కంపోస్ట్ తయారీ విధానం గురించి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి బి.రాజు, విస్తరణ అధికారి బి.సాంబశివరావు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ ఇస్తున్న అధికారులు

తెలంగాణ మద్యం స్వాధీనం



జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నిర్వహించిన సోదాలలో భారీ ఎత్తున తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు నగరానికి చెందిన జల్లెడ మణికంఠ, షేక్ ఇలియాస్ అనే వ్యక్తులు తెలంగాణ రాష్ట్రంలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో ఉన్న పలు మద్యం దుకాణాలు నుండి ఒక్కొక్కటి 750 మిల్లి లీటర్ల పరిమాణం గల 163 బాటిల్స్ అనగా 122.25 లీటర్ల మెన్షన్ హౌస్ బ్రాందీని కొనుగోలు చేసి బజాజ్ ప్యాసింజర్ ఆటోలో తరలిస్తుండగా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ గుంటూరు నగరంలో మద్యం సీసాలను అధిక ధరకు విక్రయించడంతో పాటు తమ స్మార్ట్ ఫోన్స్ ద్వారా మద్యానికి సంబంధించి ఆర్డర్స్ తీసుకొని సరఫరా చేస్తుంటారని దర్యాప్తులో తేలిందని అన్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం మద్యం విలువ రూ.1,12470 ఉంటుందని తెలిపారు. ఈ కేసులో 163 (ఒక్కొక్కటి 750 మిల్లీలీటర్లు) తెలంగాణ మద్యం సీసాలు (122.25 లీటర్ల)తో పాటు ఒక ఆటో, రెండు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు మద్యం రవాణా చెస్తే కఠిన చర్యలు తప్పవని జగ్గయ్యపేట స్పెషల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో చురుకుగా వ్యవహరించిన జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.కిషోర్ బాబు ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

యుటిఎఫ్ ప్యానల్ విజయం



జగ్గయ్యపేట: జగ్గయ్యపేట, వత్సవాయి టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు పోలింగ్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికల్లో యుటిఎఫ్ ప్యానల్ విజయం సాధించింది.

రెండు మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సభ్యులుగా గల ఈ సొసైటీలో 7 డైరెక్టర్ పోస్టులకు 20 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.కృష్ణయ్య నేతృత్వంలో ఒక ప్యానెల్, రాష్ట్ర పిఆర్‌టియు నాయకులు ఎన్.రమేష్ బాబు నేతృత్వంలో మరో ప్యానల్ మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది. ఈ రెండు ప్యానల్స్‌తో సంబంధం లేకుండా మరో ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి 300 సుమారు ఓట్లకు గానూ 250 మంది ఓటర్లు ఓట్లు ఉపయోగించుకున్నారు. కోదాడ రోడ్డులోని సొసైటీ భవనానికి రెండు వైపులా ఎం.కృష్ణయ్య, నేలవల్లి రమేష్ బాబుల ప్యానల్స్ క్యాంపులు ఏర్పాటు చేసి ఓటర్లకు అల్పాహారం, టీ, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా నందిగామ కో ఆపరేటివ్ సొసైటీ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూర్ణచంద్రరావు, సహాయ ఎన్నికల అధికారిగా బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. పట్టణంలోని బస్ డిపో సెంటర్ సమీపంలోని జగ్గయ్యపేట, వత్సవాయి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్స్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సంఘం భవనంలో కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కు జగ్గయ్యపేట మండల విద్యాశాఖాధికారి యల్ చిట్టిబాబు, ఆయన సతీమణి, మాజీ క్రెడిట్ సొసైటీ అధ్యక్షురాలు, స్కూల్ అసిస్టెంట్ హిందీ పండిట్ వేణు వినియోగించుకున్నారు.

విజయం సాధించిన వారిలో ఎం.కృష్ణయ్య, సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి, అల్లిక నరసింహారావు, అజ్మీర్ శ్రీను, సయ్యద్ రషీద ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు యుటిఎఫ్ నాయకులు కంచేటి హనుమంతరావు, పల్లవి సుధానంద్, పెనుగంచిప్రోలు యుటిఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్, సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి.

ఇటుక ట్రాక్టర్ తిరగబడి ఇద్దరు మృతి



ప్రజాశక్తి – భవానీపురం : విజయవాడ శివారు అంబాపురంలో ఇటుక రాళ్ల ట్రాక్టర్ తిరగబడి ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జి.కొండూరు మండలం నెల్లటూరు నుండి అంబాపురం వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఒడిశాకు చెందిన గజేంద్ర సబర్, బసంత్ సబర్ మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

27న తాగునీటి కోసం పాదయాత్ర

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నియోజకవర్గంలో ప్రజలకు ఫ్లోరైడ్, సిలికాన్ రహిత తాగు నీటిని అందించి ప్రజా ఆరోగ్యాన్ని కాపా డాలని డిమాండ్ చేస్తూ సిపిఐ తలపెట్టిన పాదయాత్ర ను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి దోనే పూడి శంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవనంలో ఆదివారం జరిగిన సిపిఐ మండల శాఖ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధుల నుండి ఏ కొండూరు, గంప లగూడెం, తిరువూరు మండలాలను కాపాడాలని ఈ నెల 27వ తేదీన ఏ కొండూరు నుండి పాదయాత్ర నిర్వహించనున్నట్లు శంకర్ తెలిపారు. ప్రజలకు ప్రాథమిక హక్కుగా ఉన్న రక్షిత కష్ణా జలాలను నీటిని అందించడంలో పాలకులు విఫలమ య్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాగ సత్యమ్మ బోనాల ఉత్సవం

జగ్గయ్యపేట : పట్టణ సమీపంలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట మైనింగ్ క్వార్టర్స్ సమీపంలో గల శ్రీ నాగసత్యమ్మ అమ్మవారికి శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భం గా వార్షిక బోనాలను సమర్పించారు. స్టీల్ ప్లాంట్ జగ్గయ్య పేట లైవ్‌స్టోన్ ఉద్యోగులు ప్రతి ఏడాది శ్రావణ మాసం మొదటి ఆదివారం నాగ సత్తెమ్మ అమ్మవారికి బోనాల మహోత్సవాన్ని వార్షికంగా శ్రావణమాసం సందర్భంగా ఉదయం శ్రీ నాగ సత్యమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకారాలను ఆలయ అర్చకులు టి.ఎల్.ఎన్.ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్, సంపత్ జానకిరామ్‌లు నిర్వహించారు. అనంతరం జె.ఎల్.ఎం.ఇన్‌చార్జ్ నాగరాజు దంపతులు, జె.వి.ఎస్.డి ప్రసాద్, దంపతులు పూజా నిర్వహించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ జెఎల్ఎం ఉద్యోగులు పూర్వ ఉద్యోగులు, ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి తమ బోనాలను సమర్పించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.



రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - గంపలగూడెం: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ శనివారం రాత్రి ఊటుకూరులో కొందరు పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం నెమలి నుండి మధిర వైపునకు తరలిస్తుండగా, రెండు టాటా ఎసిల్లో 85 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తూ, పట్టుపడ్డారని చెప్పారు. వాహనాల తనిఖీలో భాగంగా ఈ విషయం వెల్లడైందన్నారు. రెండు వాహనాల్లో 40 గంటలు రేషన్ బియ్యం ఉన్నట్లు వివరించారు. సదరు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్లో భద్రపరిచారు. ఈ విషయమై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. నెమలి నుండి మధిర వైపునకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డిటి శివనాగరాజు స్టాక్‌ను అదుపులోకి తసీఉకుని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

13న విజయోత్సవ ర్యాలీ

జగ్గయ్యపేట : చిల్లకల్లు గ్రామంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు మాతంగి దావీదు మాదిగ ఇంటి వద్ద శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలీషా మాదిగ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ స్థాపించి 30 ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు, జైలు జీవితాలు ఎదుర్కొని ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరనే ప్రధాన లక్ష్యంగా చేసిన పోరాటాల ఫలితంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌ఎంసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు అభినందన

జగ్గయ్యపేట : ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో మండలంలోని ధర్మవరపాడు తండా గ్రామ వైసిపి తరఫున ఎంపియుపి స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ధారావతు రోజా, వైస్ చైర్మన్‌గా మూడవతు ప్రసాద్ ఎన్నికైన సందర్భంగా మాజీ ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానును వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఉదయభాను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అసంపూర్తిగా చెరువు సుందరీకరణ

• అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



ప్రజాశక్తి-గన్నవరం : విమానాశ్రయం నుంచి కారులో రివ్వున విజయవాడ వెళ్తున్న వారికి మధ్యలో కేసరపల్లి వద్ద ఉన్న చెరువు అందంగా కనిపించాలి. దాని నుంచి వచ్చే గాలి ఆహ్లాదంగా ఉండాలి. యువకులు, వద్ధులకు వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం పంచేదిగా ఉండాలి. అందుకు చెరువుతో పాటు చుట్టూ అభివద్ధి చేయాలి. ఈ మాటలు చెప్పింది 2018లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా చేయడానికి సిఆర్డీఏ అధికారులు నిధులు ఇచ్చారు. కానీ గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం ఉండడంతో పనులు పూర్తి చేయాలేదు. నాంకే వాస్తేగా పనులు చేసి వదిలేశారు. దీంతో గ్రామస్తుల ఆశలు కా డియాశలు అయ్యాయి. ఈ చెరువు సుందరీకరణ చేసేందుకు రూ.4కోట్లు నిధులు కేటాయించా రు. అయితే చెరువు చుట్టూ ఉన్న ఇళ్లను బలవంతం రెవెన్యూ అధికారులు తొలగించారు. అప్పటి ఎమ్మెల్యే వంశీ నిర్వాశితులతో చర్చించి, ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చా రు. ఇంత వరకు నిర్వాశితులకు ఇళ్ల స్థలాలు చూపకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నా రు.

అసంపూర్తిగా చెరువు సుందరీకరణ...

కాంట్రాక్టర్ చెరువు అభివృద్ధి పనులు ఆరంభంలో వేగంగా చేయించారు. చెరువుని లోతు చేయడంతో పాటు చుట్టూ కట్టలు వేసి రోడ్డు పరిచారు. ఊర్లోమురుగు చెరువులోకి రాకుండా బయటకు వెళ్లేలా తూములు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ రోడ్డు వేసి వాకింగ్, సైక్లింగ్లకు కోసం రెండు ట్రాక్ నిర్మాణం చేపట్టారు. పనులన్నీ 70 శాతం పూర్తయ్యాయి. ఆతర్వాత మిగిలిన వ నులు నత్తనడకన సాగాయి. నేటికీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. ఆధునిక హంగుల తో చెరువుని సుందరీకరణ చేసి, అందులో బోటింగ్ ఏర్పాటు చేస్తామని, పిల్లలు ఆడుకునేందు కు వసతులు, పెద్దలు వాకింగ్ చేయడానికి ట్రాక్ నిర్మిస్తామని చెప్పడంతో స్థానికులు చెరువు రూపురేఖలు మారిపోతాయని ఆశించారు. ఏళ్లు గడిచిపోతున్నా పనులు పూర్తి చేయలేదు. కొత్తగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో పనులు పూర్తి చేస్తారా? ఆపేస్తారా? అనేది తెలియడం లేదంటున్నారు. సిఆర్ డిఏలో నిధులు పుష్కలంగా ఉన్నా పనులు సక్రమంగా చేయించ కపోవడం పట్ల అభ్యంతరం చెబుతున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న చెరువునిపూర్తి స్థాయిలో అభివద్ధి చేయకుండా వదిలేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. నాలుగు కోట్ల రూపాయల ప్రాజెక్టుని సగంలో ఆపేయడం సరి కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చెరువులోతు చేయడంతో సుడిగుండలా మారిందని, దాం ట్లో ఎవరైన పిల్లలు పడితే అంతే సంగతులని ఆందోళన చెందుతున్నారు. చెరువు గట్టు ప్రక్కనే స్కూలు ఉందని, ఎప్పుడేం జరుగుతుందో తెలియదని చెబుతున్నారు. ఎప్పటికి వీటిని పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందంటున్నారు.

ప్రభుత్వం స్పందించాలి : సుధా బత్తుల బుజ్జి, సిపిఎం

చెరువు సుందరీకరణ విషయంలో సిఆర్డిఏ అధికారులదే పూర్తి బాధ్యత. పనులు పూర్తి చేయడంలో వారే స్పందించాలి. కాంట్రాక్టర్తో పనులు చేయించాలి. ఆరంభంలో బాగానే పనులు చేసినా తర్వాత నిదానించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏదేమైనా చెరువు సుందరీ కరణను పూర్తి చేసి ఇవ్వాలి.

నిర్వాశితులకు ఇళ్లు ఇవ్వలేదు : రాంబాబు

ఇళ్లు కోల్పోయిన నిర్వాశితుల పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. వారికి ఐటీ పార్కు వద్ద ప్రభుత్వ భూమిలో స్థలాలు ఇస్తామని చెప్పారు. కానీ ఇంత వరకు పని జరగలేదని నిర్వాశితులు అంటు న్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కొన్ని సమస్యలు రావ డంతో ఆగిపోయినట్లుగా తెలుస్తోంది.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని వైసిపి కార్యకర్త శేషం గోపికృష్ణ ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అప్పయ్యకు నివాళి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఎఎంసి మాజీ డైరెక్టర్ గరిమిడి అప్పయ్య 4 వర్ధంతి నిర్వహించారు. అప్పయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల టిడిపి అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ తక్కెలపాడు గ్రామ టిడిపి నాయకులు గర్మిడి నరసింహారావు, సురేష్, ప్రభాకరరావు, దాములూరి రామచంద్ర, గర్మిడి రమేష్, గరిమెడి సత్యనారాయణ, మార్కపుడి సంఘయ్య, అప్పారావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నాగేశ్వరావు నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండల ఆర్యవైశ్య సంఘం కమిటీ ఎన్నికలు ఆదివారం నందిగామలో జరిగాయి. నందిగామ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుని గా చవట నాగేశ్వరావు, కార్యదర్శిగా పబ్బతి సీతారామ గుప్త, కోశాధికారిగా మహంకాళి చంద్రశేఖర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను ఆర్యవైశ్య పెద్దలు అభినందించారు.

పానకం కాంట్రాక్ట్ రద్దు

ప్రజాశక్తి-మంగళగిరి : స్థానిక పానకాల నరసింహ స్వామి పానకం కాంట్రాక్ట్ రద్దుచేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. పానకం నాణ్యతగా ఇవ్వడం లేదని, ఖాళీ వాటర్ బాటిల్ ధర రూ.20కు అమ్ముతున్నారని, పూజా సామగ్రి ధరలూ అధికంగా వసూలు చేస్తున్నట్లు సందర్శకుల నుండి ఫిర్యాదులు రావడంతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి విచారణ చేపట్టారు. నివేదికను దేవదాయ శాఖ కమిషనర్కు అందించడంతో కాంట్రాక్ట్ రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే కాంట్రాక్ట్ నిర్వాహకుడు నోటీస్ తీసుకోవడం లేదని ఈవో తెలిపారు. ఈ మేరకు కాంట్రాక్టర్ మంతనాలు జరుపుతున్నట్లుగా తెలిసింది.

ప్రముఖ కవి అనిల్ డ్యానీకి పితృవియోగం



ప్రజాశక్తి-తాడేపల్లి : ప్రముఖ కవి, సాహితీ రంగంలో జాషువా సాంస్కృతిక వేదిక తదితర అభ్యుదయ వేదికల్లో పని చేస్తున్న అనిల్డ్యానీ తండ్రి అబ్రహాం (73) ఆదివారం ఉదయం మృతిచెందారు. రాయనపాడు రైల్వే వర్కుషాపులో పని చేసి విశ్రాంత ఉద్యోగిగా ఎన్టిఆర్ జిల్లా కొండపల్లిలో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధప డుతున్నారు. అబ్రహాం భౌతికకాయాన్ని తాడేపల్లి తీసుకొచ్చి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. భౌతికకాయాన్ని సాహితీ స్రవంతి నుంచి సత్యరంజన్, విశ్వేశ్వరరావు, సాహితీ మిత్రులు మురళీ, ప్రజాశక్తి ఉప సంపాదకులు ఒలేటి శాంతిశ్రీ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఎస్.అనిల్, గాదె సుబ్బారెడ్డి, బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటిఎంసి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

స్కేటింగ్లో హాశిష్కు సిల్వర్ మెడల్



ప్రజాశక్తిద - తాడేపల్లి : తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ సమీపంలోని పొలాచీలో ఈనెల 7 నుంచి 11 వరకు జరిగిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలలో తాడేపల్లి డోలాస్ నగర్కు చెందిన మెరుగుపాల హాశిష్ రెండో స్థానం సాధించి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. అండర్-14 జూనియర్ విభాగంలో హాశిష్ ఆర్టిస్టిక్ స్కేటింగ్లో సిల్వర్ మెడల్ సాధించారు. ఆర్టిస్టిక్ స్కేటింగ్ విభాగంలో ఆరు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో హాశిష్ సిల్వర్ మెడల్ సాధించారు. విద్యార్థి హాశిష్ కుంచనపల్లి అరవింద సీబీ ఎస్ఈలో 8వ తరగతి చదువుతుండగా కోచ్ సత్యనారాయణ, స్కూలు యాజమాన్యం అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: సోమవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్తో పాటు నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-మంగళగిరి : అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి మంగళగిరి పట్టణం 15వ వార్డు చెందిన వెలగపాటి విక్టోరియా దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.50,000 చెక్కును, టిడిపి నాయకులు ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్కు విక్టోరియా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పి ప్రేమ్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ పాల్గొన్నారు.



మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వైయస్సార్ బ్రిడ్జిపై ఆదివారం రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గుడ్లవల్లేరు నుండి మచిలీపట్నం ముదినేపల్లి వెళ్లే వైయస్సార్ బ్రిడ్జి పై రహదారి కుంగిపోవటంతో వర్షం వచ్చినప్పుడు నీళ్లు నిలబడిపోయి రోడ్డు ధ్వంసం అవుతుంది. దీనివల్ల వాహన చోదకులకు ఇబ్బందులు పడు తున్నారు. ఇది గుర్తించిన అధికారులు పైభాగమంతా కాంక్రీట్ తో మెరక చేసే పనులు చేస్తున్నారు.



మొక్కలు నాటుతున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జాతీయ రహదారి-216కు ఇరు వైపులా స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. హైవేకు ఇరువైపులా పచ్చని చల్లని వాతావరణం నెలకొల్పేందుకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ టీ.పద్మావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురిటిగడ్డలో సంబరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డలో ఆదివారం శ్రీ గంగానమ్మ - పోతురాజు స్వామి దేవాలయంలో సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలలో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ విచ్చేసి గంగానమ్మను, పోతురాజ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, టీడీపీ మండల అధ్యక్షులు మోర్ల రాంబాబు, ఎంపిటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, మాజీ ఎంపీటీసీ దేవభక్తుని గోపాలకష్ణయ్య, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు కైతేపల్లి శ్రీనివాసరావు, నాయకులు మండవ శ్రీనివాసరావు, తాతా సుబ్బారావు, రాజులపాటి జగదీష్, గడ్డం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఎస్సీ వర్గీకరణ తీర్పును పునసమీక్షించాలని ఎస్సీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మోదమూడి గ్రామంలో ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం సామాజిక వివక్షతలు అనుభవిస్తున్న సామాజిక వర్గాలు అందరూ సమానమేనని రాజ్యాంగం 341 ఆర్టికల్ చెబుతుందన్నారు. పార్లమెంట్లో 341 ఆర్టికల్ సవరణ జరగకుండా ఆ వర్గాలను వర్గీకరించే హక్కు సుప్రీంకోర్టుకు లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్, అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు, బో ంతు ప్రకాష్ పాల్గొన్నారు.



చీకట్లో ఇబ్రహీంపట్నం రైతు బజార్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం రైతు బజార్లో అంధకారం అలుము కుంది. ఆదివారం ఉదయం నుండి కరెంటు సరఫరా నిలిపేసినట్లు తెలియ వచ్చింది. వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నం రైతు బజార్ విద్యుత్ బకాయిలు మూడు నెలల నుంచి పెండింగ్ ఉండటం వలన విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపి వేశారు. దీంతో ఉదయం నుంచి కరెంటు లేకపోవడంతో పూర్తిగా అంధకారం నెలకొంది. ఆదివారం కావడంతో రైతు బజార్ మరింత రద్దీగా ఉంది. వినియోగదారులూ, వ్యాపారస్తులూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



గ్రామాభివృద్ధిపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు కేంద్రంలో మూడు రోజుల నుంచి సర్పంచులకు ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. ఆదివారం మండల అభివృద్ధి అధికారి శివ పర్వతి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై ఆయా గ్రామ సర్పంచులు పట్టు సాధించాలని కోరారు. గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరించి వర్మ కంపోస్టు ఎరువు తయారు చేయడం ద్వారా గ్రామపంచాయతీ ఆదాయం పెంచుకోవచ్చని సూచించారు. గ్రామాలు పరిసరభంగా ఉండాలంటే పారిశు ధ్యం నిర్వహణతో పాటు ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు సమర్థవంతంగా నిర్వహించాలి కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - విస్సన్నపేట : నరసాపురం గ్రామ శివారు సత్తుపల్లి రోడ్‌లో ఎన్‌ఎస్‌పి బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకి భారీ గుంతలు ఏర్పడ్డాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయనీ, వాహనదారులకు ఇబ్బంది కలుగుతుందని సదరు విషయాన్ని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కవులూరి రాజ తాతకుంట్ల గ్రామ టిడిపి సీనియర్ నేత ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్‌టి.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో గరిమెళ్ళ భాస్కరరావు సత్యనారాయణ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏసుపాదం ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోషకాహార బిస్కెట్ విడుదల

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : పోషకాహారాన్ని అందించడంలో తమ సహకారాన్ని నొక్కి చెబుతూ, పాలు, గుడ్లను పిల్లలకు మరింత ఆకర్షణీయంగా చేయడంలో ఐటిసి సన్ ఫీస్ట్ సూపర్ ఎగ్ మిల్క్ బిస్కెట్‌ను విడుదల చేసినట్లు ఐటిసి కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో సన్‌ఫీస్ట్ అధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులతో కూడిన పెద్ద చర్చా కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) ఛైర్మన్ మదన్ మోహన్ మైతీ, ఐడిఎ ఈస్ట్ జోన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ దులాల్ చంద్ర సేన్, క్లినికల్ న్యూట్రిషనిస్ట్ లైఫ్ స్టైల్ కన్సల్టెంట్ డాక్టర్ అనన్య భౌమిక్, సెలబ్రిటీ మామ్ కొనినికా బెనర్జీ, నరిషింగ్ స్కూల్స్ సహ వ్యవస్థాపకులు సీఈఓ అర్చన సిన్హా పాల్గొన్నారు. విట మిన్లు ఎ,డి,ఇ,ఐరన్ మొదలైన అనేక ఇతర పోషకాలతో కూడిన ప్రోటీన్‌కు మూలం అని వెల్లడించారు. పాలు, గుడ్డు వినియోగం పిల్లలకు మరింత ఉత్తేజాన్ని అందించేలా వినూత్న మార్గాలను ప్యానెల్ చర్చించింది. ఈ పరిజ్ఞానం ఆధారంగా, గుడ్డు పాల బిస్కెట్ పరంగా పరిశ్రమ అంతరాన్ని అర్థం చేసుకుంటూ, ఐటిసి సన్‌ఫీస్ట్ ఆవిష్కరణ అయిన సన్‌ఫీస్ట్ సూపర్ ఎగ్ అండ్ మిల్క్ బిస్కెట్‌ను 'గుడ్‌నెస్ ఆఫ్ ప్రోటీన్'తో పరిచయం చేసింది. దక్షిణ తూర్పు భారతదేశం అంతటా రూ.5, రూ.10, రూ.30 లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఎరువుల దుకాణంలో కొన్న పొటాషియం రంగు అంటుతోందని, తనకిచ్చిన బిల్లుపై బ్యాచ్ నెంబర్ లేదని కృష్ణా రెడి అనే రైతు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగమణిమ్మ (డిఎఒ) ఆదివారం మండలంలోని ఎరువుల దుకాణాలు పరిశీలించారు. శనివారం రాత్రి గంపలగూడెం వచ్చిన సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. గోసవీడు గ్రామానికి చెందిన నరాల కృష్ణారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తోటమూలలో ఉన్న ఓ దుకాణం వద్ద పొటాస్ (ఎంఒపి) 40 సంచులు కొన్నట్లు చెప్పారు. దీంతో పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగమణిమ్మ గంపలగూడెం వచ్చేలోపే దుకాణాలన్నీ మూతపడ్డాయి. ఏ షాపునైతే పరిశీలించేందుకు వచ్చారో ఆ దుకాణాదారులు లేకపోవడంతో అక్కడే గంటకు పైగా వేచి ఉన్నారు. సీజ్ చేస్తామని తెలుపగా దుకాణాదారులు అందుబాటులోకి వచ్చి అధికారికి వివరాలు తెలిపారు. తిరువూరు ఏడిఏ కెనడి మాట్లాడుతూ బ్యాచ్ నెంబర్ ప్లాట్ నెంబర్ ప్రామాణికం కాదని రైతు కృష్ణారెడ్డితో చెప్పారు. దీనితో కృష్ణారెడ్డి అధికారులతో వాదనపడ్డారు. గోసవీడుకు చెందిన కృష్ణారెడ్డి కొనుగోలు చేసిన ఎంఒపి ప్యాకెట్ల శాంపిల్స్‌ను వెంటనే తీయాలని భౌతికంగా అందుబాటులో లేని మండల వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీని డిఎఒ నాగమణి ఆదేశించారు. దుకాణదారులు, ఫిర్యాదుదారుని సమన్వయపరిచి తదుపరి అంశాలు కొద్ది రోజుల్లో తేలుస్తామని హామీ ఇచ్చారు.


దుకాణం వద్ద వేచి ఉన్న నాగమణిమ్మ, తదితరులు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం : మొండితోక

ప్రజాశక్తి - నందిగామ : రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన రావు పేర్కొన్నారు. విజయవాడలోని భారత రాజ్యాంగ రూపశిల్పి, దేశానికి దశ దిశ చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంపై జరిగిన దాడిని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవేత్తలు, అంబేద్కరిస్టులతో కలిసి శనివారం రాత్రి నందిగామలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ శాసనసభ్యుని నివాసం నుంచి మెయిన్ బజార్, గాంధీ సెంటర్ మీదుగా రథం సెంటర్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో ఇవిఎం ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. 'ఈ' అంటే ఎన్ ట్రాప్ మెంట్ (ఉచ్చు వేయడం మోసగించటం) 'వి' అంటే వయలెన్స్ (హింసాత్మక ఘటనలు), 'ఎం' అంటే మేనేజ్మెంట్ మనీ ఎర్నింగ్ (వ్యవస్థలను మేనేజ్ చేయడం, ధన సంపాదన) పాలన సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి విగ్రహం వద్ద ఉన్న సిబ్బందిని పక్కకు పంపి దాడికి పాల్పడుతుండగా చుట్టుపక్కల ఉన్న ప్రజలు గమనించి ఒక్కసారిగా అక్కడకు చేరుకొని దాడిని అడ్డుకోవడంతో దాడి చేయడానికి వచ్చిన వారు అక్కడినుండి పరారయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ, వీరులపాడు, కంచికచర్ల, చందర్లపాడు మండలాలకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు



కూడలి బ్రిడ్జి రోడ్డు ధ్వంసం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో కొంత కాలంగా కురుస్తున్న వర్షాల కారణంగా, పక్క రాష్టాల నుండి వచ్చిన వరదల వల్ల నందిగామ మండలం, దాము లూరు గ్రామం కూడలి వద్ద ఉన్న దాములూరు నుండి వీరులపాడు వెళ్లే ప్లైఓవర్ వద్ద ఉన్న రోడ్ మధ్యలో కొట్టుకు పోయింది. రాకపోకలు పూర్తిగా బంద్ అయినాయి. పోలీసులు రహదారిపై ఎవ్వరూ వెళ్లుచుండగా రాళు అడ్డు పెట్టారు.

శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చందర్లపాడు : మండల కేంద్రమైన చందర్లపాడులోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 9వ తేదీ నుండి 11 వరకు శిక్షణా తరగతులు నిర్వహించా మన్నారు. శిక్షణలో భాగంగా మూడోరోజు శిక్షణ తరగతికి మండలంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజర య్యారు. ఈ శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీ పరిపాలన, విధులు బాధ్య తలు, పారిశుధ్యం నిర్వహణ, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ యూనిట్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ ప్రాజెసింగ్ మిల్లును ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ హెడ్ డాక్టర్ హరికృష్ణ తెలిపారు. నగరంలోని గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ అభివృద్ధి కార్యక్రమాలను తెలియేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రిపురలోని దలై జిల్లాలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ ప్రస్తుతం సంత్సరానికి మూడు లక్షల సామర్థ్యంతో నర్సరీని నిర్వహిస్తుందన్నారు. దానిని సంవత్సరానికి ఐదు లక్షలకు పెంచా లని నిర్ణయించినట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ కోసం ఆయిల్ ఫామ్ రైతులకు సమగ్ర సహా యా న్ని అందించే వన్‌స్టాప్ సొల్యూషన్ సెంట ర్‌ను కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఎఐ టెక్నాలజీ వాషింగ్ మెషిన్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ ప్రత్యేకంగా ఎఐ ఆధారిత వాషింగ్ మెషీన్లను మార్కెట్లోకి తీసుకు వచ్చినట్లు శాంసంగ్ రీజనల్ ఇన్‌ఛార్జి కె. ఈశ్వర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ కష్టమర్లకు వాషింగ్ అనుభవాన్ని తెలియచేసేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. అలాగే వాషింగ్ మెషీన్ బ్రాండ్‌లలో ఎప్పటికపుడు అత్యాధునిక టెక్నాలజీతో నూతన ఉత్పత్తు లను తీసుకు వస్తున్నామని తెలిపారు. ఇందులో భాగం గానే ఎఐ టెక్నాలజీతో కూడిన కొత్త వాషింగ్ మెషీన్లను అందు బాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని ఉత్పత్తులు వినియోగదారుని కోసం అందించనున్నట్లు తెలిపారు.

సంజీవిని హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో సంజీవిని హాస్పటల్ ను బొగ్గవరపు దివ్య (ఎంబిబిఎస్, ఎండి,) (జనరల్ మెడిసిన్) హాస్పటల్‌ను తన తల్లిదండ్రులచే బొగ్గవరపు రవీంద్ర బాబు, కళ్యాణి, ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ వైద్య వత్తిని ఎంచుకొని ప్రతి పేదవాడికి సహాయం చేయాలని సంకల్పంతో సంజీవిని హాస్పిటల్ ప్రారంభించామని తెలిపారు. హాస్పటల్‌లో అన్ని రకాల వసతులతో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

గంగానమ్మ బోనాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని, పశ్చిమఇబ్రహీంపట్నం ఒడ్డే ఓబన్న యూత్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా గంగానమ్మ వారికి బోనాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పశ్చిమ ఇబ్రహీంపట్నం టిడిపి నాయకులు రావి ఫణి ప్రతి సంవత్సరం ఆషాడ, శ్రావణమాస బోనాలను సమర్పిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ఇబ్రహీం పట్నం ఎస్‌టి కాలనీలోని టిడిపి బీసీ మున్సిపాలిటీ అధ్యక్షులు బొంత బాబురావు ఇంటి నుండి బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి గంగానమ్మ తల్లి దేవస్థానం వరకు వచ్చారు.